క్లుప్తంగా

తోటపల్లికి చేరిన ఏకశిలా విగ్రహాలు


తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం రాత్రి ఏకశిలా విగ్రహాలు చేరుకున్నాయి. విశాఖకు చెందిన వైష్ణవీదేవి దంపతులు సమకూర్చిన అమూల్య ఏకశిలా విగ్రహాలు, రాతి ద్వారాలు, రాతిపీఠాలు, రాతి దీపపు ప్రమిదలకు భక్తులు పూజలు చేశారు. విగ్రహాలను వితరణ చేసిన దాతలకు అభివృద్ధి కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

సావిత్రిబాయి పూలే వర్ధంతి


సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం లిల్లీరాణి తదితరులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి, సిబ్బంది సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా విద్యకు పెద్దపీట వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, అనాగరికత రాజ్యమేలుతున్న సమయంలో స్త్రీ జనోద్ధరణకు ఆమె ఎంతగానో పాటుపడ్డారని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పి.అమల తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు


రేషన్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొమరాడ: మండలంలోని పరుశురాంపురం గ్రామ రేషన్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అధికారి ఎ.సురేష్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో పీడీఎస్ సార్టెక్స్, ఫోర్టిఫైడ్ 646 కిలోలు, ఎండీఎం సార్టెక్స్ 1829 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే 32 పంచదార ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత రేషన్ షాపు యజమానిపై 6(ఎ) కింద కేసు నమోదు చేసి, స్టాక్ సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పురుషోత్తం, సీఎస్‌డీటీ హరి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమైన ఆమె ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. పథకాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన ప్రణాళికలు చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తాగునీటిని క్లోరినేషన్ చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల ఆలయంలో ప్రత్యేక పూజలు

భామిని: మండలంలోని లివిరి గ్రామంలో రాధాకృష్ణుల ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వందలాది మంది భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

550 పశువులకు టీకాలు


నారాయణపురంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో గాలికుంటు వ్యాధి టీకాలను 550 పశువులకు వేసినట్లు మండల పశువైద్యాధికారి గణేష్ శుక్రవారం తెలిపారు. పశువులకు వ్యాధి లక్షణాలు సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామని చెప్పారు. పశువులకు నోటివెంట చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలిగిత్తల మధ్య పుళ్లు వంటివి వ్యాధి లక్షణాలని తెలిపారు. వాటి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు సిబ్బంది రైతులకు తెలియజేశారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావుకు మద్దతుగా పార్టీ నేతల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం ఓటర్ల ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు పార్టీ అభ్యర్థులకు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ, కరపత్రాలు పంచిపెడుతూ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


సీతంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జగన్


భామిని: బత్తిలిలో ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు సింహాచలం, అన్నాజీరావు


గరుగుబిల్లి: నాగూరులో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం


కురుపాం: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత


పాలకొండ రూరల్: వాటపాగులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు చేపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు


పాలకొండ పట్టణంలో సుధాకర్‌ను గెలిపించాలని కోరుతున్న నగరపంచాయతీ చైర్మన్ రాధాకుమారి


కొమరాడ: విక్రంపురంలో వైఎస్సార్ సీపీ నేతల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

3 నెలల వయసు దాటిన పశువులకు టీకాలు


మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరావు

సీతంపేట: 3 నెలల వయసు దాటిన పశువులకు తప్పనిసరిగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలని స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పశువైద్య సిబ్బందితో సమావేశమై, పలు సూచనలు చేశారు. సంచ వ్యాధి నివారణకు సంబంధించి, సీతంపేటకు 13,400 డోసుల టీకాలు, భామినికి 9,300 డోసుల టీకాలు వచ్చాయని తెలిపారు. వీటిని ఆవులు, ఎద్దులు, గేదెలు, పోతులకు వేయనున్నామన్నారు. పారుడు వ్యాధికి ఫిబ్రవరిలో టీకాలు వేశామని, ఈ నెల 1వ తేదీ నుంచి కాళ్లు, నోటి సంచ వ్యాధుల నివారణకు టీకాలు వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. వేసవిలో పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


విద్యార్థుల విద్యాప్రగతిపై ఆరాతీస్తున్న ఎంఈఓ ఆనందరావు

సీతంపేట: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ ఎం.ఆనందరావు సూచించారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి పదో తరగతి విద్యార్థుల చదువుపై ఆరాతీశారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బాగా చదివి, మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు తెలిపారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూఓ అమల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


ప్రమాదాలకు నెలవుగా మారుతున్న అట్టలి దగ్గర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పాలకొండ డీఎస్పీ కృష్ణారావు అన్నారు. శుక్రవారం పాలకొండ–వీరఘట్టం, విశాఖపట్నం, సీతంపేట, శ్రీకాకుళం రోడ్ల అత్యంత ప్రమాదకరమైన మలుపులు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐలకు సూచించారు. స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచీ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయన వెంట పాలకొండ ఎస్‌ఐ బి.శివప్రసాద్ ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు

• పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు


మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పట్టణంలోని విలేకరులతో మాట్లాడిన ఆయన ఇటీవల జరిగిన ప్రమాదాల్లో గాయపడిన వారిలోనూ, చనిపోయిన వారిలోనూ ఎక్కువగా మైనర్లు, లైసెన్సులు లేనివారు ఉన్నారని తెలిపారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను అరెస్ట్ రేగు గణపతిని చేశామని, అతడికి లైసెన్స్ లేదని దీంతో ఆ లారీ యజమానిపై కూడా కేసు వేశామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట సీఐ మురళీధర్, ఎస్‌ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బ్యారెక్స్‌లో మహిళా దినోత్సవం


విద్యార్థినులతో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి

మక్కువ: స్థానిక సీఆర్‌పీఎఫ్ బ్యారెక్స్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు మక్కువ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థినులతో పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేడుక జరుపుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినులకు పెన్నులు అందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి విద్యార్థినులతో ముచ్చటిస్తూ విద్యార్థి దశనుంచే క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హితవు పలికారు. పాఠశాలలు, కళాశాలల్లో ఆకతాయలు ఎవరైనా వేధిస్తే పోలీసులకు(దిశ) సమాచారం అందించాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, గురువులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సాయినగర్ కాలనీకి సచివాలయాల తరలింపు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో గత కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న 3, 4 సచివాలయాలను సాయినగర్ కాలనీలోని బీఎంఆర్ థియేటర్ సమీపంలోని భవనంలోకి మార్చినట్లు ఈఓ వి.రామచంద్రరావు తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: స్థానిక పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్ కో ఏడీఈ తిరుమలరెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండే ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పక్కాగా ఎన్నికల నియమావళి పాటించాలి

పాలకొండ: పక్కాగా ఎన్నికల నియమావళి పాటించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో శుక్రవారం సమావేశమైన ఆయన ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున దానికి తగ్గట్టుగా అధికారులు, ప్రజలు నడుచుకోవాలన్నారు. ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్పులు అందజేయాలని, పార్టీకి చెందిన వ్యక్తులతో కాకుండా సిబ్బందే నేరుగా ఇంటింటికీ వెళ్లి, స్లిప్పులు ఇవ్వాలన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న సర్పంచ్ చంటి

భామిని: మండలంలోని చిన్నమూలగూడకు చెందిన బిడ్డిక దాలమ్మ ఈ నెల 8వ తేదీన మృతి చెందింది. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల తక్షణ సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండగొర్రి మంగ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండగొర్రి చంటి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి


సమావేశంలో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణాశాఖ సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సురేష్ స్కూల్‌లో శుక్రవారం రహదారి భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో నిబంధనలు పాటించడం వల్ల అది అలవాటుగా మారుతుందని ఆయన తెలిపారు. ఈ అలవాటు జీవితానికి మంచిదన్నారు. అందరూ రహదారులను ఉపయోగిస్తారని, అయితే కొద్దిపాటి అవగాహనతో ప్రమాదాలు నివారించవచ్చని హితవు పలికారు. విద్యార్థులతా వారి కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు, స్నేహితులకు తెలియజేయాలని తద్వారా అందరూ నిబంధనలు పాటించి సంతోషంగా ఉండాలని సూచించారు. అధిక వేగం ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. నిబంధనలు పాటించక, వేగంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, కుటుంబాలు కష్టాల్లో పడుతున్నాయన్నారు. రహదారి దాటేటప్పుడు రెండువైపులా గమనించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ వైద్యుడు డాక్టర్ డి.నారాయణ రావు, ఏఎస్‌ఐ టి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించండి


మాట్లాడుతున్న అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ అడ్డాకుల చిన్నారావు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో పాల్గొన్న ఆయన ఇప్పటికే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువుల అంచనాలను రూపొందించి, ప్రతిపాదనలు చేశామని తెలిపారు. సకాలంలో అవి రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖలోని సీహెచ్‌సీ గ్రూపులకు పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రుణం మంజూరు చేయాలని, వాటర్ షెడ్ పథకం అమలులోని గ్రామ రైతులకు 90 శాతం రాయితీపై ఆయిల్‌ఇంజిన్లు, టార్పాలిన్లు, స్ప్రేయర్లు ఐటీడీఏ ద్వారా అందివ్వాలని కోరారు. సమావేశంలో ఏఈఓలు, వీఏఏలు, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం


పెదఖర్జ గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: నవధాన్యాలు సాగు చేస్తే నేల సారవంతమవుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని సర్పంచ్ మండంగి మల్లేష్ తెలిపారు. మండలంలోని పెదఖర్జ గ్రామంలో ఏపీసీఎన్‌ఎఫ్ మండల ఇన్‌చార్జ్ ఆర్.పురుషోత్తం ఆధ్వర్యంలో నవధాన్యాల సాగు–నేలతల్లి బాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఖరీఫ్ సీజన్ కన్నా ముందుగానే పొలాల్లో నవధాన్యాలు జల్లుకోవాలని, ఇలా చేస్తే నేలకు దీని ద్వారా పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. అనంతరం విత్తనగుళికల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ ఎం.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


రైతులకు విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పిస్తున్న జట్టు ట్రస్టు ప్రతినిధులు

కొమరాడ: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జట్టు ట్రస్టు ప్రతినిధులు ప్రసాద్, అన్నపూర్ణ, బాలామణి, మహేష్ కలిసి రైతులకు విత్తనశుద్ధి, విత్తన బంతుల తయారీని వివరించారు. ఏడాది పొడవునా పంటలు పండించుకోవడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి సేద్యం వైపు ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు కో–ఆర్డినేటర్ మురళి, వీఏఏ రేణుక పాల్గొన్నారు.

14న నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ


ఏఎన్‌ఎంలకు నులిపురుగు నివారణ మాత్రలు అందిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నట్లు ఎంపీడీఓ డొంక త్రినాధులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎం.సింగుపురం వైద్యాధికారి కడియం చిరంజీవి నేతృత్వంలో ఏఎన్‌ఎంలకు నులిపురుగు నివారణ మాత్రలు అందజేశారు. అన్ని పాఠశాలల్లోని పిల్లలకు వీటిని అందించాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సీతంపేట: మండలంలోని మోహన్‌కాలనీలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు బి.వెన్నెల, వసంత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు దిగుబడి అధికంగా వస్తుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించాలని తెలిపారు. అలాగే నవధాన్యాలు సాగు చేసి, నేల సారవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంగయ్య తదితరులు పాల్గొన్నారు.